

HAPPY Valentine's Day

# జిల్ జిల్లుమంది ప్రేమా..!


**మనిషి మస్త్ జోర్ మీద ఉన్నడంటే మనసు దిల్‌కా ధడ్‌కన్ దగ్గరుందనే! ఆడైనా మగైనా ప్రేమైతే చాలు పారే ప్రవాహంలా మారిపోతారు. అప్పడే మూత తీసిన బీర్ సీసాలా పొంగిపోతుంటారు. పంచ్‌ల పలక్‌నామాకే పంచ్‌లు వేసే లెవెల్‌లో ఉంటారు. ఎనర్జీకి కేరాఫ్ అడ్రెస్ ప్రేమికులు! అంతేనా... చెంపలు కెంపులు కావడాలూ, గుండె గొంతులో కొట్టుకోవడాలూ, కళ్లు లైట్లలా వెలగడాలూ... అసలు బ్యూటీ పార్లర్‌కి వెళ్లకుండానే డైమండ్ ఫేషియల్ చేసినంత గ్లోతో వెలిగిపోతుంటారు వీళ్లు. ధైర్యంలోనూ మనల్నెవడ్రా ఆపేది... అన్నట్టుగా ఉంటుంది ప్రేమికుల పద్ధతి. వీళ్లు ఇంతలా తుళ్లి పడుతున్నారంటే అసలేముందీ ప్రేమలో అని చాలామంది గుండె మీద చెయ్యేసుకుని, సారీ గుండు మీద చెయ్యేసుకుని ఆలోచించారు. శాస్త్రవేత్తలైతే అధ్యయనాలూ చేశారు... కాస్తో కూస్తో ప్రేమ గుట్టు రట్టు చేశారు. అదే లవ్ ఎనర్జీ ..!**

### గాయం మాయం

ప్రేమ మనసుకు సంబంధించిందా శరీరానికి సంబంధించిందా అని అడిగితే చెప్పడం కాస్త కష్టమే. అయితే మనిషి ప్రయాణంలో ఈ రెండిటికీ గాయాలయ్యే అవకాశం ఉంది. కాలికి ఏ దెబ్బో తగిలితే బయటికి కనిపిస్తుంది. మనసును కలచివేసే సంఘటన ఎద లోపల వ్రణాన్ని మిగులుస్తుంది. ఈ రెండు రకాల గాయాలనూ త్వరిత గతిన మాన్పే శక్తి ప్రేమకు ఉంది. లవ్ ఎనర్జీ అన్నది మందుకు ఏ మాత్రం తీసిపోదు. మనసైన వారి సాంగత్యం, ప్రేమపూర్వక స్పర్శ దేహ ప్రాణాలు రెండిటికీ సాంత్వన చేకూరుస్తాయి. అమెరికాలోని ఒహియో స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనంలో బొబ్బలు, కోసుకున్న గాయాల్లాంటివి ఒకరికొకరు అన్యోన్యంగా ఉండే జంటల్లో తొందరగా తగ్గుతున్నట్టు వెల్లడైంది. దీనికి పెళ్లి చేసుకున్నారా లేదా అన్నది సంబంధం లేదనీ కేవలం జంట మధ్య ఉన్న అన్యోన్యతే ఉత్ప్రేరకంగా పనిచేస్తున్నదనీ తెలిపింది. బంధాలను బలపరిచే ఆక్సిటోసిన్, వాసోప్రెసిన్ అనే హార్మోన్లు గాయాలను మాన్పడంలో కీలకంగా పనిచేస్తున్నాయట. ప్రేమలో ఉన్నవారిలో నొప్పిని తగ్గించే ఎండార్ఫిన్లూ అధిక మోతాదులోనే ఉంటాయట. మనసుకు తగిలిన గాయాలకు ప్రేమను మించిన మందులేదని లెక్కకు మిక్కిలి సందర్భాల్లో రుజువైంది. తగిలిన గాయాలే మాయమవుతుంటే కొత్త గాయాల ముచ్చటెక్కడిది. జంటగా ఉంటే ఏనుగంత బలం మరి!

### ష్... బ్లష్!

టింగ్... ప్రియమైన వాళ్ల మెసేజ్. ఆ సంగతి ఎవరూ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చదివిన వెంటనే కందిన బుగ్గలే బయట పెట్టేస్తాయి. ఇక, తను పక్కనుంటే ముఖానికి అదనపు మేకప్ ఏమీ అక్కర్లేదు. అందరూ గులాబీ రంగు బ్లష్‌ని ఏరికోరి రాసుకుంటే, ప్రేమపక్షుల్లో అది సహజంగానే అందాన్ని తెస్తుంది. ఏమిటీ ఈ రహస్యం అంటే, ప్రియమైన వాళ్లని చూడగానే మెదడు ఆనంద పారవశ్యానికి, ఒక రకమైన మొహమాటానికి గురవుతుంది. దీని వెనుక మతలబును కూడా కనిపెట్టేసింది సైన్స్. ఇష్టమైన వాళ్లని చూడగానే మెదడు నోరెపినెఫ్రన్ అనే రసాయనాన్ని విడుదల చేస్తుంది. అడ్రినలిన్ అనే హార్మోన్ విడుదలకు నోరెపినెఫ్రన్ సాయపడుతుంది. అది ఎగ్జయిట్‌మెంట్‌కు కారణం అవుతుంది. దీంతో ముఖంలోని నాడులు విచ్చుకుని ఆ ప్రాంతంలో రక్త ప్రసరణ అధికం అవుతుంది. దీంతో చెంపలు కెంపుల్లా కనిపిస్తాయి. ముఖ్యంగా ఒక రిలేషన్‌షిప్ తొలినాళ్లలో ఈ తరహా మార్పులు ఎక్కువగా కనిపిస్తాయట. లవర్స్ బ్యూటీ సీక్రెట్ ఇదన్నమాట!



### ఒళ్లంత తుళ్లింత

**కేరింతలూ** తుళ్లింతలూ యువత లక్షణాలు. ముఖ్యంగా ప్రేమికుల ప్రధాన ఆనవాళ్లు. ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటారు. అయినా పరీక్ష చక్కగా పాసైపోతారు. చదివిన కాసేపూ బుర్ర చురుగ్గా ఉంటుంది మరి! అసలు ఉత్సాహమంతా ఒక్క దగ్గరే పోగై ఉందా అనిపిస్తుంది అసలైన ప్రేమజంటను చూస్తుంటే. దీనికి కారణం లవ్ ఎనర్జీనే. ఇది హై ఫ్రీక్వెన్సీ కలిగిన శక్తి. దీన్ని ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోవచ్చు. ఎంచక్కా పెంపొందించుకోనూవచ్చు. నాకంటూ ఒక తోడు, నన్నే నమ్మే ఒక జోడు ఉందన్న భావన మనిషిలో సంతృప్తినీ ధైర్యాన్నీ పెంచుతుంది. హాయిగా నవ్వడానికి ఈ ఒక్కటీ చాలు కదూ! ఇక, ప్రేమ జంట మధ్య గాఢమైన అనుబంధం ఉంటుంది. అమితమైన ఆకర్షణా కనిపిస్తుంది. ఇవే శరీరం పనితీరును చక్కగా చేసే, మనసుకు హాయినిచ్చే ఆక్సిటోసిన్, డోపమైన్, నోరెపినెఫ్రన్‌లాంటి వివిధ హార్మోన్ల విడుదలకు కారణం అవుతాయి. ఇవన్నీ పుష్కలంగా ఉంటే మనిషి ఫుల్ జోష్ మీద ఉండటం అన్నది అసలు వింతే కాదు. ఎందుకంటే అసలైన వింత ప్రేమ కాబట్టి. అవునంటారా... కాదంటారా?!

### కడుపులో క'వ్వింత'

'బటర్‌ఫ్లైస్ ఇన్ ద స్టమక్' అనే పదబంధం చాలా మంది వినే ఉంటారు. కడుపులో ఏదో వింతైన భావన కలగడం అన్నది దీని అర్థం. ప్రియమైన వాళ్ల సాంగత్యంలో ఈ అనుభూతిని పొందని వారుండరంటే అది అతిశయోక్తి కాదు. మానసికంగానే కాదు భౌతిక ఆకర్షణ కలిగి ఉన్న వ్యక్తుల మధ్య ఆడామగా అన్న తేడా లేకుండా ఈ భావన కలుగుతుంది. కేవలం దగ్గరగా ఉండటమే కాదు, వాళ్ల ఆలోచనలూ ఈ వింతైన అనుభూతికి కారణం అవుతాయి. ఇష్టమైన వాళ్ల ఊహ రాగానే శరీరంలో డోపమైన్, అడ్రినలిన్‌లు విడుదల అవుతాయి. డోపమైన్ ఒక ఫీల్‌గుడ్ హార్మోన్. అడ్రినలిన్ కాస్త ఒత్తిడిని కూడా తెచ్చిపెడుతుంది. ఈ రెండూ ఒకేసారి ఉండటం వల్ల కడుపులో ఒకరకమైన కంగారుతోపాటు సంతోషంగానూ అనిపిస్తూ ఉంటుంది. అలాగే మెదడులోని భావోద్వేగాలను నియంత్రించే వ్యవస్థ వేగస్ నర్వ్‌కు అనుసంధానమై ఉంటుంది. అదే గుండె, పొట్ట భాగాలకు కనెక్టయి ఉంటుంది. ఇష్టమైన వారిని చూసినప్పుడు ఈ నాడి ఉత్తేజితం అవడంతో గుండె వేగం పెరగడం, కడుపులో అదోలా ఉండటం లాంటివి జరుగుతాయట. కొమ్మ గొంతులోన గుండె కొట్టుకుంటే నవ్వుతావు... ఏ రాగం.. ఇది ఏ తాళం... అని కవులు రాసేదీ దీని సంగతే!



### అందమంటే తనే

వావ్... హ్యాండ్సమ్! హాయ్... బ్యూటిఫుల్! ప్రేమికుల పలకరింతలు ఇలాగే ఉంటాయి. ఆమెకు అతనే నవ మన్మథుడు. అతనికి ఆమే రతీదేవి. తా వలచింది రంభ, తా మునిగింది గంగ... అంటూ ఎవరన్నా వెక్కిరించినా, నా కళ్లతో చూడు అంటారే తప్ప వెనక్కి తగ్గరు. ఎందుకంటే వాళ్ల ప్రపంచం వేరు. అందులోని వర్ణాలు వేరు. అక్కడి అందానికి నిర్వచనమూ వేరే! అక్కడ మనకు కనిపించే శరీరంతోపాటు వాళ్లు పంచుకున్న అనుభూతులు, వ్యక్తిత్వం, అవతలి వ్యక్తితో కలిసి ఉన్నప్పుడు కలిగే సౌకర్యం లాంటి వాటితో కలగలిసిన అమితమైన ప్రేమ ఆ అందానికి రంగులు జోడిస్తుంది. మనకిష్టమైన వాళ్లతో ఉన్నప్పుడు ఆక్సిటోసిన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదల అవుతుంది. ఇది వ్యక్తుల మధ్య నమ్మకాన్ని పెంచి, బంధాలను బలోపేతం చేసేందుకు తోడ్పడుతుంది. అంతేకాదు, కౌగిలించుకున్నప్పుడు, ముద్దు పెట్టుకున్నప్పుడు ఉత్పత్తయ్యే ఇది ఊబకాయం సమస్యనూ దూరం చేస్తుందట. ఇక, ప్రేమికుల్లో విడుదలయ్యే డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ కూడా తమ జోడును ఆకర్షణీయంగా కనిపించేలా చేయడంలో కీలకంగా పనిచేస్తుంది. అది బాబూ సంగతీ... ప్రేమంటే ఉత్తి ఫిజిక్స్ కాదు... అందులో ఇంత కెమిస్ట్రీ ఉంది!

---

ఇష్టమైనవారి కౌగిలి.. అంతులేని ప్రేమను ప్రసాదిస్తుంది. బాధలను తరిమేస్తుంది. బంధాలను బలోపేతం చేస్తుంది. అంతేకాదు.. మానసికంగా, శారీరకంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. ఆరోగ్యానికీ అండగా నిలుస్తుంది. అందుకే.. ఈ ప్రేమికుల దినోత్సవం రోజున మీ భాగస్వామికి ఓ వెచ్చని కౌగిలిని కానుకగా ఇవ్వండి.

## కానుకగా.. ఓ కౌగిలి!

- ప్రియమైన వారిని కౌగిలించుకున్నప్పుడు.. శరీరంలో 'ఆక్సిటోసిన్' అనే హార్మోన్ విడుదల అవుతుంది. దీనికే 'లవ్ హార్మోన్' అని పేరు. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది. అనేక రకాల మానసిక ప్రయోజనాలు అందిస్తుంది.
- రోగ నిరోధక శక్తిని పెంచడంలోనూ 'హగ్' సాయపడుతుంది. కౌగిలింత వల్ల శరీరంలో తెల్లరక్త కణాలు పెరుగుతాయి. కౌగిలితో శరీరంలో 'హెల్పర్ టి' సెల్స్, యాంటిబాడీలూ మెరుగుపడతాయి. ఇవి శరీరాన్ని వివిధ వ్యాధుల నుంచి రక్షించడంలో సాయపడతాయి.
- భాగస్వామిని ప్రేమగా దగ్గరికి తీసుకోవడం ద్వారా.. 'కార్టిసోల్' అనే హార్మోన్ స్థాయులు తగ్గుతాయి. ఫలితంగా మానసిక, శారీరక ఒత్తిళ్లు దూరమవుతాయి. మనుషుల్లో సానుకూల భావాలు పెరుగుతాయి.
- 'హగ్'తో శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. శరీరం అంతటికీ ఆక్సిజన్ సరఫరా సజావుగా సాగుతుంది. దాంతో, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులను ప్రమాదం తగ్గుతుంది.



## సరికొత్త ఇష్క్!

**జెన్-జెడ్‌గా** పేరున్న ఈతరం సరికొత్తగా ఆలోచిస్తున్నది. చదువు మొదలుకొని కెరీర్ వరకూ.. ప్రతీది కొత్తగానే ఉండాలని కోరుకుంటున్నది. ప్రేమ విషయంలోనూ 'జెన్-జెడ్' తీరు కొత్తగానే ఉంటున్నది. ముఖ్యంగా.. 'వాలెంటైన్స్ డే'పై నవతరం ఆలోచనా దృక్పథం.. విభిన్నంగా కనిపిస్తున్నది.



ఒకప్పుడు 'వాలెంటైన్స్ డే' అంటే.. మధ్యాహ్నం పార్కుల్లో కలుసుకోవడం, సాయంత్రం సినిమాలు, రాత్రిపూట క్యాండిల్ లైట్ డిన్నర్లు! లేకుంటే.. క్లబ్‌లు, డిస్కోలు, పార్టీలు! కొన్నేళ్లుగా 'ప్రేమికుల దినోత్సవం' ఇలానే జరుగుతున్నది. కానీ, 'జెన్-జెడ్' మాత్రం.. ప్రేమను అనేక రూపాల్లో వ్యక్తం చేయడానికి, ఈ వేడుకను ఓ వేదికగా మార్చుకుంటున్నది. సంప్రదాయానికి భిన్నంగా ఈ రోజును జరుపుకొంటున్నది. ప్రేమికుల రోజున బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం.. వీరికి అంతగా నచ్చడం లేదు. ఖరీదైన ఆభరణాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, పూల బొకేలు.. ఇవన్నీ ఓల్డ్ ఫ్యాషన్ అని వాళ్ల ఫీలింగ్. ఎందుకంటే.. వీరు బహుమతులను కూడా డిజిటల్ రూపంలోనే చూస్తున్నారు. 'స్పాటిఫై'లో ఇష్టమైన ప్లేలిస్ట్.. కస్టమైజ్ చేసిన డిజిటల్ ఆర్ట్.. క్యూరేటెడ్ మీమ్స్.. ఇవే వీరి వాలెంటైన్ బహుమతులు. ప్రేమించిన వ్యక్తి మనసు తెలుసుకొని, వారి భావోద్వేగాలకు అనుగుణంగా బహుమతులు ఇస్తున్నారు.
సోషల్ మీడియాతోపాటు ఎదిగిన ఈతరం వాలెంటైన్ డే వేడుకలకూ ఆన్‌లైనే వేదిక. ఇన్‌స్టా రీల్స్, ఫేస్‌బుక్‌లలో పోస్టులతోనే నవ ప్రేమికులు సంబురాలు చేసుకుంటున్నారు. అంతేకాదు, వీరు అన్నిరకాల ప్రేమలనూ కోరుకుంటారు. ఫ్యామిలీ లవ్, సెల్ఫ్ లవ్, సోషల్ లవ్.. ఇలా అన్నిటికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రేమ, భావోద్వేగాలను కేవలం బాయ్‌ఫ్రెండ్/ గర్ల్‌ఫ్రెండ్ నుంచే కాకుండా.. అందరినుంచీ పొందవచ్చని చెబుతున్నారు.

## టమాట పరోటా



**కావలసిన పదార్థాలు**

**టమాట:** రెండు, **గోధుమపిండి:** ఒక కప్పు, **ఉప్పు:** తగినంత, **అల్లం:** రెండంగుళాల ముక్క, **వెల్లుల్లి రెబ్బలు:** నాలుగు, **మెంతులు:** పావు టీస్పూన్, **వాము:** పావు టీస్పూన్, **నూనె:** కొద్దిగా.

**తయారీ విధానం**



ముందుగా మిక్సీలో అల్లం, వెల్లుల్లి, మెంతులు, టమాట ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఒక గిన్నెలో గోధుమపిండి, తగినంత ఉప్పు, వాము, టమాట పేస్ట్ వేసి ముద్దలా కలిపి నూనె రాసి పది నిమిషాలు పక్కనపెట్టాలి. పిండి కలిపేటప్పుడు అవసరమైతే కొన్ని నీళ్లు చల్లుకోవచ్చు. పిండిని కొద్దికొద్దిగా తీసుకుని, పిండి చల్లుకుంటూ పరోటాలు చేసుకోవాలి. స్టవ్‌మీద పెనం వేడయ్యాక, పరోటాలను రెండు వైపులా నూనె వేస్తూ కాల్చుకుంటే సరిపోతుంది. అంతే, వేడి వేడి టమాట పరోటాలు రెడీ!

## ప్యార్‌కే ప్రాధాన్యం

**నవతరం..** తమ భాగస్వామి ఎంపికలో 'ప్రేమ'కే తొలి ప్రాధాన్యం ఇస్తున్నది. అందం, ఆస్తి కన్నా.. అనురాగానికే ఓటేస్తున్నది. ఆన్‌లైన్ పెళ్లి సంబంధాల వేదిక.. జీవన్‌సాథీ తాజాగా ఓ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. దేశంలో 29 శాతం మహిళలు, 47 శాతం పురుషులు.. కాబోయే జీవిత భాగస్వామిలో కేవలం ప్రేమను మాత్రమే కోరుకుంటున్నట్టు చెప్పారు. ఇక ఒంటరి వ్యక్తుల్లో 40 శాతం మంది.. ప్రేమ కోసం మకాం మార్చడానికి కూడా సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. అయితే, ఈ విషయంలో తల్లిదండ్రులు కొంచెం కోపంగా ఉన్నారు. వారు మాత్రం.. తమ పిల్లలు తమతోనే ఉండాలని కోరుకుంటున్నారు. ఇక ముంబయి, పూణె, బెంగళూరువాసులు.. ఎన్‌ఆర్‌ఐలపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. విదేశాల్లో స్థిరపడినవారినే వివాహం చేసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే, రాజధాని ఢిల్లీ పిల్లగాళ్లు మాత్రం.. దేశంలో స్థిరపడిన వ్యక్తులకే తమ ఓటు అంటున్నారు. 39 శాతం మంది మహిళలు.. తమ భాగస్వామి తమకు అనుకూలంగా ఉంటే చాలని చెబుతున్నారు. అయితే, 11 శాతం మంది మాత్రం.. ఆర్థిక స్థిరత్వం కూడా ఉండాలని ఆశిస్తున్నారు. జీవిత భాగస్వామి ఎంపికలో తమ నిర్ణయమే ఫైనల్ అని 96 శాతం మంది అబ్బాయిలు అంటుండగా.. తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాలను చేసుకుంటామని నాలుగు శాతం మంది చెబుతున్నారు. ఇక వివాహ వయసు విషయానికి వస్తే.. చాలామంది 27-30 ఏళ్ల మధ్య వివాహం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారట. అదే.. పెళ్లికి అనువైన వయసని నమ్ముతున్నారు. ఇక పెళ్లి ఖర్చులోనూ భాగస్వామి కూడా భాగం కావాలని 72 శాతం మంది భావిస్తున్నారు. 17 శాతం మంది మాత్రమే.. వివాహ వేడుకను ఆడంబరంగా జరుపుకోవాలని కోరుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ.. సరైన భాగస్వామి దొరికినప్పుడు ఆలస్యం చేయకుండా వివాహం చేసుకోవాలని తల్లిదండ్రులు సూచిస్తున్నారు. వైవాహిక బంధానికి సౌకర్యమే ముఖ్యమని, సమయపాలన అవసరం లేదని చెబుతున్నారు.



## ప్రేమదేశాలు..

**ప్రేమ.. విశ్వవ్యాప్తమైంది. భూమ్మీద ఏ మూలకు వెళ్లినా.. ప్రేమికులు కనిపిస్తారు. 'ప్రేమికుల దినోత్సవం' జరుపుకొంటారు. కానీ, ప్రాంతాన్ని, పద్ధతులను బట్టి.. వేర్వేరుగా సెలెబ్రేట్ చేసుకుంటారు. ఒక్కో దేశంలో ఒక్కో తీరుగా.. 'వాలెంటైన్స్ డే' వేడుకల్లో మునిగితేలుతారు.**

**మొట్టమొదటి** వాలెంటైన్స్ డే కార్డు ఫ్రాన్స్‌లోనే పుట్టిందని చాలా మంది నమ్మకం. 1415లో ఓర్లీన్స్ డ్యూక్ చార్లెస్.. జైలు నుంచి తన భార్యకు ప్రేమలేఖలు పంపాడట. అవే మొట్టమొదటి వాలెంటైన్స్ డే కార్డులు. ఇక ఫిబ్రవరి 12 నుంచి 14 వరకూ ఫ్రాన్స్‌లోని 'వాలెంటైన్' అనే గ్రామం.. ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఊరంతా గ్రీటింగ్ కార్డులు, గులాబీల అలంకరణలతో నిండిపోతుంది. బహుశా.. ప్రపంచంలోనే అత్యంత అందమైన వాలెంటైన్స్ డే ఇక్కడే జరుగుతుంది.

**అర్జెంటీనాలో** వాలెంటైన్స్ డే.. 'జూలై'లో వస్తుంది. 'ద వీక్ ఆఫ్ స్వీట్‌నెస్'గా.. వారం రోజుల వేడుక చేసుకుంటారు ఇక్కడి ప్రేమికులు. చాక్లెట్లు, మిఠాయిలు ఇచ్చిపుచ్చుకుంటారు.

**ఫిబ్రవరి** 14న ప్రేమికులు పెళ్లితో ఒక్కటయ్యే సంప్రదాయం ఫిలిప్పీన్స్‌లో కనిపిస్తుంది. ఇక్కడ చాలామంది యువజంటలు.. ప్రభుత్వం నిర్వహించే వేడుకలో 'వివాహ' బంధంలోకి అడుగుపెడతారు.

**ప్రపంచమంతా** ఏడాదిలో ఒక్కరోజు 'వాలెంటైన్స్ డే' జరుపుకొంటే.. కొరియన్లు నెలకోసారి ఈ వేడుకను నిర్వహిస్తారు. ఇక్కడ ప్రతినెలా 14వ తేదీ ప్రేమికుల రోజే! మే నెలలో గులాబీల దినోత్సవం, జూన్ నెలలో ముద్దుల దినోత్సవం, డిసెంబర్‌లో హగ్స్ డే.. ఇలా ఒక్కో నెల 14వ తేదీన ఒక్కో తీరున జరుపుకొంటారు.

**వేల్స్** వాసులు జనవరి 25న ప్రేమికుల దినోత్సవాన్ని జరుపుకొంటారు. దీనిని 'సెయింట్ డ్విన్వెన్ దినోత్సవం' అని పిలుస్తారు. ఈ రోజున ప్రేమికులు ఒకరికొకరు చేతితో తయారుచేసిన చెక్క స్పూన్‌లను ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ సంప్రదాయం 16వ శతాబ్దం నుంచి కొనసాగుతున్నది.

**ఫిబ్రవరి** 14 సందర్భంగా.. డెన్మార్క్ ప్రేమికులు 'స్నో డ్రాప్స్'గా పిలుచుకునే తెల్లని పూలను ఇచ్చిపుచ్చుకుంటారు. ఇక్కడ ప్రేమికులకే కాదు.. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులకు కూడా బహుమతులు, గ్రీటింగ్ కార్డులు అందిస్తారు.

**ఆఫ్రికా** ఖండ దేశం ఘనాలో ఫిబ్రవరి 14ను 'జాతీయ చాక్లెట్ దినోత్సవం'గా జరుపుకొంటారు. దేశంలో పర్యాటకాన్ని పెంచడానికి అక్కడి ప్రభుత్వం ఈ ఏర్పాటుచేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా కోకో ఉత్పత్తి చేసే దేశాలలో ఘనా కూడా ఒకటి. ఫిబ్రవరి 14న చాక్లెట్ దినోత్సవం కోసం.. ఇక్కడ ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తారు.



**జపాన్‌లో** 'వాలెంటైన్స్ డే' అంటే మహిళలదే! ఇక్కడ ఆడవాళ్లు తమ భాగస్వాములకు చాక్లెట్లను బహుమతిగా అందిస్తారు. అయితే.. నెల తర్వాత వచ్చే 'మార్చి 14' పురుషుల వంతు! 'వైట్ డే'గా జరుపుకొనే ఈ రోజున.. మగవాళ్లు ఆడవాళ్లకు ప్రత్యేక బహుమతులు ఇస్తారు. దక్షిణ కొరియాలోనూ ఇదే సంప్రదాయం పాటించినా.. వైట్ డే తర్వాత మరో నెలకు, అంటే ఏప్రిల్ 14న బ్లాక్ డేనూ సెలెబ్రేట్ చేసుకుంటారు.

**ఫిబ్రవరి** 14ను స్నేహితుల దినోత్సవంగా జరుపుకొంటారు ఫిన్లాండ్‌వాసులు. ప్రేమికుల కన్నా.. స్నేహితులతోనే బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.